# అప్పీలు కేసు

" హలో, చేతక్ ధర ఎంతుంచండీ?" ... " రండి సార్ కూర్చోండి మీకు తెలియందేముంది, మామూలు పద్ధతే!... ఈక్వివలెంట్ డాలర్సిస్తే వెంటనే ఇప్పిస్తాం, రూపాయలు డిపాజిట్ చేస్తే రెండుమూడేళ్లకి బండి రావచ్చు" ... " నేనడిగేది బ్లాక్ రేటండి!" ... " అదా, పదిహేనున్నరా" .. " ఎక్స్ షోరూమేనా, సెకండ్ హాండ్ కాదుగదా!" ... " షోరూమ్ దగ్గరేనండి. నా టేబిల్ దగ్గిరే మీరు కాష్ ఇచ్చేసి ఆయన బండీ మీదే ఇటునించిటు మీరు రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్ళి అరగంటలో మీ ఇంటికేసు వెళ్ళిపోవచ్చు." ... "మరి రిజిస్ట్రేషన్ ఖర్చులు?" ... " మీరిద్దరూ మాట్లాడుకోవటంలో ఉంటుంది.. అయినా మీరు ఓ నెల ముందర నాకు చెప్తేనే ఇదంతా, లేకపోతే దొరకటం కష్టం. మీకు నచ్చిన కలర్ కూడా సెలక్టు చేసుంచుతాం." ... " థాంక్సండి!"

" ఎక్స్‌క్యూజ్‌మి, చేతక్ బ్లాక్ రేటెంతలో కొచ్చిందండి?" .. "పద్నాలుగువేలు" . " అదేంటండీ! పోయినసారి పదిహేనున్నరని చెప్పారు!" ... " అది రెణ్ణెల్ల క్రితం ధర!" ... " ఇంకా తగ్గొచ్చంటారా?" ... " ఏమో ఎవరు చెప్పగలరు? ఇవాల్టిరేటిది!" ... " బండి దొరకటం కష్టమేమో!" . " అంత కష్టం కాదు" ... "థ్యాంక్యూ"

"జస్టేమినిట్! చేతక్ ధర తగ్గిందట గదా!" .. " యస్సార్! "... " ఎంతలోకొచ్చింది?" ... " పదమూడున్నర దగ్గర ఆగింది."... "అరె! అంత తక్కువలోనా !" .. " అవున్సార్, మార్కెట్‌లోకి వెరైటీ లొస్తున్నాయిగదా! అవన్ని రెండు వెరైటీ లొచ్చాయి ప్రిన్సొచ్చింది. సెంటో హండ్రెడ్ సి ఇ. దిగిపోయింది. వెస్పా ఎక్స్ ఇకి తొంభై కోట్లు కలెక్ట్ చేసేసింది కంపెనీ. వెస్పా సి యల్. గట్రా ఏవో ఇంకో రెండు దిగబోతున్నాయి. లూనా, హీరో మెజస్టిక్, టి.వి.యస్. బజాజ్ కంపెనీల ఫీఫ్టీ బళ్లు రోలయిపోతూనే ఉన్నాయి. అదేదో బాటరీ బండి చూసే ఉంటారుగదా? ఇంత కాంపిటీషన్‌లో చేతక్ ధర తగ్గకేమవుతుంది? ఏం తగ్గినా తగ్గేది బ్లాక్ రేటే గదా! .. అసలింకో విషయం ముప్పై, నలభై, డెభ్భై, ఎనభై . ఇట్లా రకరకాల సి.సి.ల బళ్లున్నాయి. అవ్వన్నీ దిగిపోతే ఇహ చెప్పక్కర్లేదు."

" అంటే.. ఇంకా తగ్గచ్చంటారా?" ... " ఆఁ, నాలుగైదునెలల్లో పన్నెండుకు, పదకొండుక్కూడా దిగొచ్చు!" ... " వ్వాట్, పదకొండుక్కూడానా!. వెరీ గుడ్!" . " ఇంతకీ బండీ ఎవరికీ "మీకేనా?" " "అహాఁ నాక్కాదు, నాకుందిలెండి.. అదుగో, ఆరోడ్డుమీద్దే!"..." ఓహో, అమ్మేద్దామనా! తొందరగా కానిచ్చేయటం మంచిది" ... " అమ్మకమూ కాదండి బాబూ?" .. " మరేంటి?" .. " నాదొక గొడవ వ్యవహారంలెండి!... మా మామగారి దగ్గర్నుంచి తగులు డబ్బు గుంజాలి!... వస్తా!"

"చెప్పేదేదో పూర్తిగా చెప్పి వెళ్ళిపోండి సార్ ! ఇదేదో లిటిగేషన్ కేసులాగుంది!" ... " యస్, యస్, కరెక్ట్ ! అప్పీలు కేసు. చెప్పమంటారా... రెండేళ్ళకిందట నాపెళ్లిలో మామామగారు ఇరవై వేలు కట్నమిస్తానని పైసివ్వకుండా పిల్లని నాకంటగట్టేసాడు. మంచి వాణ్ణి గాబట్టి నమ్మకముంచి పిల్లని తెచ్చేసుకున్నాను. చూసి చూసి ఏడాదికిందట ఇహ చూళ్లేక కట్నం కలెక్షను విషయం ముందర పెట్టాను. విషయాన్ని వాళ్ళు ఆ వేళకి ఫైనల్ చేసారు. ఒప్పుకున్నాను, మంచివాణ్ణికదా! కానీ మా మామ ఏం చేసాడో తెలుసా? 'ఒరేయ్ చెల్లికొడకా సన్నాసి, డబ్బు డబ్బుగా ఇస్తే పేకాడేస్తావు, నగల్లో ఇస్తే సేఫ్టీలేదు

ఇళ్ళ స్థలంగా ఇద్దామంటే నువ్వేమో ఇల్లుకట్టి చావలేవయ్యే, అకాస్త చెక్కా అతి నిరుపేద కులాలవాళ్ళు గుడిసెలేసుకుని మాదంటారయ్యే, నేనిచ్చినట్టా, నువ్వు తిన్నట్టా కనక చేతక్ కొనిస్తాను. ఇంట్లో బోరుకొట్టకుండా మా అమ్మాయిని పేరంటానికీ, పెళ్ళి పందిళ్లలోకీ, భజన మందిరాల్లోకీ కాస్త తిప్పుతూండు. మా అమ్మాయికి కిరీటం చేయిస్తావని నేనెప్పుడూ ఆశించలేదు. ఈ మాత్రం చెయ్యి చాలు నీ జన్మ ధన్యమవుతుంది.- అన్నాడు. .. ఇవ్వి ఎంత దారుణంగా -అరుణారుణంగాఉన్నాయండీ... ఆహఁ చెప్పండీ... సహించాను, ఆ మాటలన్నీ సహించాను.. సరే ఇంతకీ ఈ బండీయే ఆ బండీ లెండి! ... ఇప్పుడు నేనెంత అన్యాయమై పోయానో మీ కర్థమైందా?.. రెండేళ్లక్రితం ఇవ్వాల్సిన ఇరవైవేలని పదహారుకు తగ్గించి ఏడాదికిందట బండి రూపంలో మా మావ నాకిచ్చాడు. అదిప్పుడు సావకాశంగా పదకొండుకు పడిపోతుందని మీరు చెబుతున్నారు.. ఒరిజినల్ లావాదేవీ ప్రకారం డిఫరెన్సు తొమ్మిదివేలు రావాలిగదా!... అసలుకన్నా వడ్డీ తప్పదుకదా!. అర్ధరూపాయి చొప్పునేలెండి . ఏడాదికే అయిదువేలకీ మూడొందలు! వెరశి అయిదువేల మూడొందలు నాకు హక్కుందా లేదా చెప్పండి? ఆ మధ్యవర్తుల్నే వెళ్లి అడగమంటాను.. వస్తాన్సార్. . పదకొండుకన్నా ఇంకా తగ్గితే మాత్రం చిన్న ఫోనొకటి, ట్రిబుల్ టూకి కొట్టండి. మా బ్యాంకు ఫోన్లెండి - మీ మేలు మర్చిపోను. నా అప్పీల్లో అంకెలు మార్చుకుంటాను.. వస్తాన్సార్!''

'' మరి మీరు ఏడాదిబట్టీ బండి అనుభవించారుగదా, దానికీ ఈ సొమ్ముకీ చెల్లవ్వదా?''

'' ఏంటీ, అనుభవం ఖరీదు అయిదు వేల మూడొందలా!... దారుణం!... కావలిస్తే ఓ అరవెయ్యో, వెయ్యో తగ్గించుకోమనండి. దట్సాల్!''

'' ఒకవేళ బండి ధర ఏ ఇరవై వేలకో పెరిగుంటే నాలుగు వేలు మీరు మీ మామగారి కిచ్చే వారా?'' ... '' అహ్హహ్హహ్హా!.. మీరు భలేవారండీ! ఇక్కడొక జగత్సత్యముంది. కల్పవృక్షమూ , కామధేనువూ, పాలసముద్రమూ, ఇవ్వి వన్వే ట్రాఫిక్ సూత్రాన్ని పాటిస్తూంటాయి. మన కిస్తూంటాయేగాని మందగ్గిర మాత్రం పుచ్చుకోవు పిల్లనిచ్చిన మామ కామధేనువు వంటి వాడు. పిండుకోటమే మనపని. మనం ఎదురివ్వక్కర్లేదు... ఇహిఁహిఁహిఁ... వస్తాన్సార్!''

'' ఇంతకీ మీ మామగారి పేరేంటన్నారు?'' ... '' వజ్రాల నవనీతం!'' ... '' నవనీతంగారా, చంపేసారు పొండి!... ఆయనకి నేనేగదండీ నా బండిని తొమ్మిదివేల కమ్మింది! రంగేయించిన తర్వాత దాన్ని మీకిచ్చారన్నమాట!''

'' ఆఁ తొమ్మిదివేలా! ఎంత అన్యాయం!... అయితే ఆయన నాకిప్పుడు ఏడువేలూ ప్లస్ వడ్డీ బాకీ అన్నమాట!''

'' అసలు సార్, అయిదేళ్ళ క్రితం ఈ బండిని నేను కొన్నప్పుడే సెకండ్ హాండ్‌ది.''... ''వ్వాట్!'' ... '' అసలు నవనీతంగారు మీకు ఇరవైవేలూ ఇవ్వాలనే మీ పెళ్ళయిన నెలరోజులకి డబ్బు తీసుకుని బయల్దేరార్ట మీరుంటున్న ఇల్లు మీరు చెప్పినట్లు మీ స్వంత ఇల్లు కాదని తెలిసింది. ఆయనకి చిరాకొచ్చింది...'' . . '' అయితే ఆయనకేం కష్టం? ఆయన కూతుర్ని ఏలుకునేది నేనా, ఇల్లా?''

'' ఆయనసలివ్వడేమోనని భయపడి మీరు మధ్యవర్తుల్ని పెట్టుకున్నారు గదా! వాళ్ల మాటకీ ప్రెస్టీజికి కట్టుబడి మీకిద్దామని పదహారువేలూ సిద్ధం చేసుకునేసరికి ఓ సుప్రభాతంలో మీరు మొదట్నుంచీ చెప్పుకున్నట్టు మీ క్వాలిఫికేషను డిగ్రీ కాదనీ, టెన్త్‌క్లాసనీ కూడా తెలిసిపోయింది సెకండ్ హాండ్ బండికోసం తక్షణం ఊరంతా వెతికి వెతికి నా దగ్గిరున్న బండీని తొమ్మిది వేలకి కొనేసాడు. పదహారు వేలయిందని చెప్పి మీ కిచ్చేసాడు ''

'' ఓర్నాయనో, ఎంత పన్చేసాడు! ఆయన కూతురు కాపరం చేసేది నాతోనా, డిగ్రీ కాగితంతోనా? .

దిస్ ఇజ్ సింపుల్ డిసీట్. ట్రిక్, ఫేక్, కన్నింగ్, ఎడల్టరీ, హిపోక్రసీ, హాండ్ గివింగ్, వాట్ నాట్!.. తక్షణం అయన అంతు తేల్చుకుంటాను. ఇంతకి తెగిస్తాడా!.. హుఁ!"

"తేల్చుకోండి, తేల్చుకోండి, ఆయనిప్పుడు లాయరు గారింట్లోనే ఉన్నాడు"

"లాయరుగారింట్లోనా , ఎందుకూ?".. "ఎందుకా, బండి రిజిస్ట్రేషను చేస్తున్నప్పుడు రాతలో మీరు ఆయనకి దొరికిపోయారుట. మీరు సెంట్రల్ బాంక్ ఆఫ్ ఇండియాలో పన్చేస్తున్నట్లు ఆయనెదురుగా రిజిస్ట్రార్ ఆఫీసులో అప్లికేషను రాసిచ్చార్టగా! మిమ్మల్ని కలవటం కోసం ఆయన నిన్న బాంక్ కెడితే మీరు వర్క్ చేస్తున్నది ఆ బాంక్‌లో కాదనీ కో ఆపరేటివ్ సెంట్రల్ బాంక్‌లోననీ తేలింది! రామబాణంలాగా ఆయన రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్ళి పోయి మీ స్వహస్తాల్తో రాసిన అప్లికేషన్ తాలూకూ ఫోటోస్టాట్ కాపీని సంపాదించేసాడు, తననీ, బాంక్‌ని మోసం చేసినట్టు మీ మీద కేసు పెట్టపోతున్నాడు. వింటున్నారా?" .. "ఊఁ" ... "ఆయన స్కూటర్ని ఆయనకిచ్చేస్తేనే గాని మిమ్మల్ని వదిలేట్టులేదు!" "......" "అరె, అదేంటి, మాటా పలుకూ లేకుండా అట్లా హటాత్తుగా లేచెళ్లిపోతున్నారేంటి సార్, మీ అప్పీలు కేసెప్పుడు పెడతారు?... మీరు కుడి రోడ్డు కెళ్తున్నారేంటి సార్! లాయర్ గారిల్లు ఎడమ రోడ్డులోనండి బాబూ! ఇటు, ఇటు.. ప్చ్. ఇప్పట్లో ఇంకీ చుట్టుపక్కల కనిపించడు కాబోలు, పూర్ ఫెలో!...."

(ఆంధ్రసచిత్రవారపత్రిక 4-11-83)

★★★ ★★★ ★★★

# సుందరీ- యోగమూ

"అబ్బ వదలండీ, వాళ్ళొచ్చి చూశారంటే అల్లరైపోతాం" అంది, తన చెయ్యి విడిపించుకునే ప్రయత్నంలో ఆయాసపడుతూ సుందరి. "నువ్విక్కడ మేడమీద దాక్కున్నావని వాళ్ళకెట్లా తెలుసు, వాళ్ళిక్కడికి రార్లే" అంటూ సుందరి చెయ్యి వదలకండానే ఆమెని తన వైపు లాక్కున్నాడు యోగారావు.

"మీకు తెలీదండీ బాబూ, వాళ్ళసలే అల్లరి వాళ్ళు ఎక్కడికైనా వస్తారు. మంజరి అయితే పర్వాలేదు, అర్థంచేసుకోగలదు. దానికి పెళ్ళయింది కాబట్టి. మండితం, రంజితం, శింజితం, అంజనలు అసలే గడుగ్గాయిలు, పైగా పెళ్లీ పెటాకులూ లేనివాళ్ళు. ఏదో చిన్న నాటి వాళ్ళం గదాని, విడిదిల్లు స్వేచ్ఛగా దొరికింది గదాని ఆడుకుంటున్నాం. తమరిక్కడున్నారని తెలిస్తే దాక్కోడానికి నేను మేడమీదికి రాకపోదును, ఈ గదిలోకి అడుగు పెట్టకనే పోదును. వదలండీ ప్లీజ్! .. అభాసయిపోతామండీ బాబూ!"

యోగారావు సుందరిని వదల్లేదు. పైపెచ్చు ఆమె చెయ్యొదిలేసి నడుం పట్టుకుని చటుక్కున తనవైపు గుంజుకున్నాడు. ఆ ఊపులో, అంత వరకూ యోగారావు పడుకుని చదువుకున్న పడక్కుర్చీ చేతిమీదికి ఇద్దరూ పడి, లోపలికి జారారు. యోగారావు కిందా, సుందరి పైనా. కోణం కుదరక యోగారావు